క్లుప్తంగా

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

ఓర్వకల్లు: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, మండల కార్యదర్శి నాగన్న తెలిపారు. మండలంలోని నన్నూరు గ్రామ సీపీఎం శాఖ మహాసభను ఆదివారం నాయకుడు మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నూతన కార్యదర్శిగా మధుసూదన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో సభ్యులు మాసూం బాషా, సలాంబాషా, దస్తగిరి, భాస్కర్, దానమయ్య, సిద్దయ్య, బొజ్జన్న, స్వాములు, ఆకుల మధు తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్‌ఎస్ కార్యక్రమంను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా కార్యక్రమానికి మండల అధికారులు తప్పకుండా హాజరు కావాలని, గైర్హాజరైతే ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని హెచ్చరించారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఓర్వకల్లు: మండలంలోని గుమ్మితం తండాలో ఆదివారం నాటుసారా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.

జాతీయ క్రీడలకు శాంతిరామ్ విద్యార్థి



సందీప్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సందీప్ జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. ఈనెల 28న కడప ఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలో నిర్వహించిన జేఎన్‌టీయూఏ షటిల్ బాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలో సందీప్ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం చెప్పారు. అక్టోబర్ 26 నుంచి 29వ తేదీ వరకు చెన్నై ఎస్‌ఆర్‌ఎం యునివర్శిటీలో జరిగే సౌత్‌జోన్ జాతీయ ఇంటర్ యునివర్శిటీ చాంపియన్‌షిప్ పోటీలో సందప్ పాల్గొంటాడన్నారు. ఈ మేరకు విద్యార్థి సందీప్‌తోపాటు పీడీ చంద్రారెడ్డిని ప్రిన్సిపాల్ అభినందించారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఏపీటీఎఫ్ 80 వసంతాలు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో విజయనగరంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం పిలుపునిచ్చారు. ఆదివారం సంఘం కార్యాలయంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో మహాసభలు జరగనున్నట్లు చెప్పారు. ఈ సభలకు సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కమలాకర్ పాల్గొన్నారు.

స్వీయరక్షణపై దృష్టిపెట్టాలి

కర్నూలు(సెంట్రల్): భగత్‌సింగ్ స్ఫూర్తితో మహిళలు, విద్యార్థినులు తమకు తాముగా స్వీయరక్షణ కల్పించుకోవాలని ఏపీ గ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల పేర్కొన్నారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక బాలికల వసతి గృహంలో నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కర్నూలు కల్చరల్: వ్యవసాయ శాఖ బహుళ ప్రయోజన విస్తరణ అధికారుల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక, సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం కర్నూలులో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు, జాయింట్ సెక్రటరీ మల్లేష్, మధుసూదన గౌడ్ ప్రతాప్ నాయుడు పాల్గొని నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా చిన్న అయ్యన్న, ఉపాధ్యక్షుడిగా టి.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా శివన్న, కోశాధికారిగా వినయ్, మహిళా అధ్యక్షురాలిగా అమృతవాణి, జిల్లా గౌరవాధ్యక్షుడిగా రంగన్నను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. జిల్లా నాయకులు మహేష్ యాదవ్, రంగస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులతో 'కూటమి' చెలగాటం

- విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- సీబీఎస్ఈ విధానం రద్దు... ఎస్‌ఎస్‌సీ పద్ధతిలో 'పది' పరీక్షలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు
- టీడీపీ సర్కార్ తీరుపై విద్యార్థి, ప్రజా సంఘాల మండిపాటు



ఓర్వకల్లు: టీడీపీ కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాలను రద్దు చేయడం లేదా పేర్లు మార్చడం తప్పా చేసిందేమీ లేదంటున్నారు సామాన్యులు సైతం. ప్రత్యేకించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందంటూ విద్యార్థి, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసిన సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్)విధానాన్ని రద్దు చేసింది టీడీపీ కూటమి సర్కార్. ఈ యేడు నుంచి పాత పద్ధతిలోనే (సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్) పది పరీక్షలు నిర్వహించాలనే సంస్కరణను తీసుకొచ్చింది కూడా. దీంతో అన్ని వర్గాల నుంచి వమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు నెలల్లో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మళ్లీ మొదటికి రానుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా సీబీఎస్ఈ సిలబస్‌ను అభ్యసించిన విద్యార్థులు పది, ఇంటర్ అనంతరం జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను చాటి కేంద్ర ప్రభుత్వ కొలువుల్లో సత్తాచాటే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మూడేళ్ల పాటు కష్టనష్టాలకు ఓర్చుకొని, సీబీఎస్ఈ సిలబస్‌కు అలవాటు పడిన విద్యార్థులు తాజా ప్రభుత్వ నిర్ణయంతో ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై విద్యార్థి, ప్రజా సంఘాలతోపాటు తల్లితండ్రులు సైతం మండి పడుతున్నారు. ఇదేం నిర్ణయం అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా సీబీఎస్ఈ అమలు....

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాప్రమాణలు మెరుగుపర్చడమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022–23 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేసింది. ఈ మేరకు ఓర్వకల్లు మండల పరిధిలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(ఓర్వకల్లు), ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయం పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. 8వ తరగతి నుంచి ప్రారంభించి క్రమంగా 10వ తరగతి వరకు కొనసాగించారు అధికారులు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు రాయాల్సి ఉంది. ఈ మేరకు విద్యార్థులు సైతం ఆ దిశగా సన్నద్ధం అయ్యారు. అయితే కూటీమి ప్రభుత్వం మళ్లీ పాతపద్ధతిలోనే పది పరీక్షలు రాయించాలని నిర్ణయం తీసుకోవడంతో అయోమయంలో పడ్డారు పది విద్యార్థులు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

సీబీఎస్ఈ విద్యను ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు సైతం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చింది కూడా. ఈ మేరకు మెలకువలపై అవగాహన పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే బోధన సాగించారు. ఎన్నో ఇబ్బందులు ఓర్చి తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులు సైతం ఉత్సాహంగా ఉన్నారు. అంతా బాగుంది అనుకుంటుండగా గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం అన్నివర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. గత ప్రభుత్వ నిర్ణయాలను తొసిపుచ్చడమే తమ లక్ష్యం అన్నట్లుగా టీడీపీ ప్రభుత్వ తీరు ఉందని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం విద్యావ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యార్థుల నైపుణ్యాన్ని దెబ్బతీసినట్లే



సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేయడమంటే విద్యార్థుల నైపుణ్యాన్ని దెబ్బతీసినట్లే అవుతుంది. ఈ విధానం వలన విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా ఆసక్తికి అనుగుణంగా చదవులు కొనసాగిస్తారు. నైపుణ్యాలను మెరుగుపర్చుకుని ఏ రాష్ట్రానికైనా వెళ్లి చదవుకోవచ్చనే ఆత్మస్థైర్యాన్ని పొందారు. సమస్యలను తమంతట తమే పరిష్కరించుకునే సామర్థ్యాలను పెంపొందించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం ఏ మాత్రం సమంజసం కాదు.

–రవీంద్రనాథ్, ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓర్వకల్లు

కాలానికి అనుగుణంగా విద్యను అందించాలి



పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యను అందించాల్సిన అవసరం ఉంది. సీబీఎస్ఈ విద్యా విధానం పేద, మధ్య తరగతి పిల్లలకు ఎంతో ఉపయోగకరం. సాంకేతిక విద్యపై పట్టు సాధిస్తారు. పోటీ పరీక్షల్లో నెగ్గేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రత్యేకించి గ్రామీణ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.ప్రభుత్వ నిర్ణయం విచారకరం. 6 నుంచి 10వ తరగతి వరకు సీబీఎస్ఈ విద్యను అందిస్తే బాగుంటుంది.

– షాలుమియా, విద్యార్థి తండ్రి, కొమరోలు

సీబీసీఈ విధానం కొనసాగించింటే బాగుండేది



సీబీఎస్ఈ విద్యావిధానాన్ని ఈ ఏడాది కొనసాగించి ఉంటే బాగుండేది. నేను 8వ తరగతి నుంచి సీబీఎస్ఈ సిలబస్‌కు అలవాటు పడ్డా. ఎంతో కష్టపడి పాఠ్యాంశాలు అర్థం చేసుకున్నాం. జాతీయ స్థాయిలో విషయాలు బోధపడుతున్నాయి. దీంతో జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో రాణించవచ్చనే నమ్మకం వచ్చింది. సబ్జెక్టు ఎంత కష్టమైన ఎదుర్కొనే వీలుటుంది. మళ్లీ ఎస్‌ఎస్‌సీ పద్ధతిని పరీక్షలు రాయలంటే కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఏం చేద్దాం అలా రాసిపెట్టి ఉంది.

– ఎం.లక్ష్మిప్రియ, 10వతరగతి, మోడల్ స్కూల్, ఓర్వకల్లు

చేతివృత్తి కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజినేయులు

కోడుమూరు రూరల్: చేతి వృత్తులను నమ్ముకుని జీవిస్తున్న కార్మికులపై ప్రభుత్వాలకు చిన్న చూపు తగదని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు పేర్కొన్నారు. కోడుమూరులోని స్నేహ వినాయక కల్యాణ మండపంలో ఆదివారం చేతివృత్తిదారుల జిల్లా సమితి సమావేశానికి ముఖ్య అతిథులుగా రామాంజినేయులుతోపాటు సమాఖ్య జిల్లా కార్యదర్శి కారన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగనాథ్ హాజరయ్యారు. రామాంజినేయులు మాట్లాడుతూ చేనేత, మంగలి, రజక, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, గొర్రెలపెంపకందారుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారిస్తుండడంతో దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం చేతి వృత్తిదారుల సమాఖ్య నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాధవస్వామి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్రిష్ణ, మండల కార్యదర్శి రాజు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నగరపాలకలో నేడు వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు అర్జీల రూపంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు




గాయపడిన రామాంజినేయులు, వెంకటేష్

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి బళ్లారికి వెళ్లే రోడ్డులో హంద్రీబ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. దేవనకొండ మండలం వీరంపల్లెకు చెందిన రామాంజినేయులు కోడుమూరు నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. దేవనకొండ మండలం బోదెపాడు గ్రామానికి చెందిన వెంకటేష్ బైక్‌పై కోడుమూరుకు వస్తున్నాడు. హంద్రీబ్రిడ్జి సమీపంలో ఎదురెదురుగా రెండుబైకులు ఢీకొన్నాయి. ఇద్దరు బైక్‌లపై వేగంగా వస్తుండడంతో రోడ్డుపై ఎగిరిపడ్డారు. ఇద్దరి తలలకు గాయలయ్యాయి. ఇదే సమయంలో గుంతకల్ నుంచి కోడుమూరు వస్తున్న భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి వారిని చూశాడు. వెంటనే కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో క్షతగాత్రులకు ప్రాణాపాయం తప్పింది.

బస్టాండ్ సర్కిల్....

కోడుమూరులోని ఆర్‌టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కింద పడడంతో గోనెగండ్ల మండలం లింగదిన్నెకు గ్రామానికి చెందిన యువకుడు అశోక్ గాయపడ్డాడు. స్థానికులు కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అశోక్ కోలుకుంటున్నాడు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

కర్నూలు(సెంట్రల్): నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు ఎస్‌ఎండీ షరీఫ్, ఎస్‌డీ ఖాజా ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో లీటర్ నూనె రూ.190, కేజీ బియ్యం రూ.72 ఉండడంతో సామాన్య ప్రజలు ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. గతంలో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరిన టీడీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక ధరల పెరుగుదలకు సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూనెల దిగుమతి సుంకం శాతం పెంచుకోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుమతిస్తే అందుకు టీడీపీ మద్దతు ఇవ్వడం తగదన్నారు.

మానవతా సంస్థ సేవలు అభినందనీయం

కర్నూలు కల్చరల్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థతో విడదీయరాని అనుబంధం ఉందని డ్వామా పీడీ అమర్‌నాథరెడ్డి అన్నారు. వీఆర్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయనకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ప్రకృతిని ప్రేమించాలని, సహజ వనరులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మానవతా జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు సంవత్సరాలు డ్వామా పీడీగా అమర్‌నాథ్‌రెడ్డి సంస్థకు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. మానవతా యూనిట్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పాటిల్ హనుమంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రోగ్రాం కమిటీ చైర్మన్ యుగంధర్‌శెట్టి అధ్యక్షతన జరిగిన కా ర్యక్రమంలో మానవతా మాజీ అధ్యక్షుడు శివా రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరికిషన్, కోశాధికారి రమణ, శేషయ్య, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత



అధికారులతో కలిసి రన్‌వేను పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

- ఎయిర్ పోర్టులో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ బిందు మాధవ్

ఓర్వకల్లు: అక్టోబర్ 1వ తేదీన సీఎం నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన నిమిత్తం పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎయిర్ పోర్టును సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పత్తికొండ మండలం, పుచ్చకాయలమాడ గ్రామంలో జరిగే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సీఎం హాజరు కానున్నారని చెప్పారు. ఇందులో భాగంగా వాహనాల పార్కింగ్, వీఐ పీల సమావేశం, టర్మినల్ బిల్డింగ్, రన్‌వే, పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రోటో కాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని ఎయిర్ పోర్టు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, కర్నూలు ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసాచారి, తహసీల్దార్ విద్యా సాగర్, సీఐలు ప్రసాద్, కేశవరెడ్డి, పవన్ కిశోర్, చంద్రబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను ఆదుకోవాలి



ధర్నా కరపత్రాలను ప్రదర్శిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కోడుమూరు రూరల్: కాంట్రాక్ట్ పద్ధతిపై ఏళ్ల తరబడి పనులు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. ఈ మేఏరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 30న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నాయన్నారు. చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలు అనుభవిస్తున్న కార్మికులకు కనీసం వేతనం రూ.26వేలు అందజేయడంతో పాటు, ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు మద్దిలేటి, వెంకటేష్, అచ్చమ్మ, సుంకులమ్మ, అయ్యస్వామి, చంద్రమోహన్, శివ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ అభివృద్ధికి కృషి

కర్నూలు (టౌన్): జిల్లాలో హ్యాండ్‌బాల్ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా ఒలింపిక్ సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు కోరారు. స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గత నాలుగు సంవత్సరాలుగా హ్యాండ్‌బాల్ అభివృద్ధి కుంటుపడిందన్నారు. అసోసియేషన్ సభ్యులు నూతనోత్సాహంతో హ్యాండ్‌బాల్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సువర్ణ క్రీడా సంఘాల ప్రతినిదులు పాల్గొన్నారు.

తైక్వాండోతో ఆత్మరక్షణ

ఆత్మరక్షణ క్రీడ తైక్వాండో అని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలో ఆదివారం తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన ఆమె ప్రతిభ చాటిన క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. సీనియర్ శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ బాధ్యు లు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాలన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జపం చేశారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు మహా రాజభోగ నివేదన చేసి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కొణిదేడు-స్టీల్ ప్లాంట్ సమీపంలో వేలాడుతున్న 33కేవీ వైర్లు




కొణిదేడు వద్ద వరి పొలంపై వేలాడుతున్న వైర్లు

పొంచివున్న ప్రమాదం

పాణ్యం: విద్యుత్ ప్రమాదం పొంచివుంది. విద్యుత్ తీగెలు కిందకు వేలాడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురికాల్సిందే. యమపాశాలుగా దర్శనమిస్తున్నాయి విద్యుత్ తీగెలు. వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు గాలి వానలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉండడంతో రైతులు బిక్కుబిక్కుమంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. పడిపోయిన విద్యుత్ స్తంభాలు స్థానంలో సిబ్బంది పునరుద్ధరణ పనులు చేసేశారే తప్పా కొత్తవి ఏర్పాటు చేయలేదు.

రక్షణ గోడకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్లు

ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మలను తక్కువ ఎత్తు దిమ్మెపై ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మరీ అధ్వానంగా రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒరిగిన స్థంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాని ప్రజలు కోరుతున్నారు. విషయాన్ని విద్యుత్ సబ్ ఇంజినీర్ సుందర్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. సిబ్బందితో చర్చించి సమస్యలను పరిష్కారిస్తామన్నారు. కేఆర్‌ఆర్ తతండాలో సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్ తొగించిన విషయం తెలిసిందని, పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



రైల్వే స్టేషన్ సమీపంలో ఒరిగిన స్తంభాలు

నిరంతర సాధనతో పతకాలు ఖాయం

కర్నూలు (టౌన్): నిరంతరం సాధన చేస్తే పతకాలు ఖాయమని సీఐడీ సీఐ నాగేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓడిన వారు తదుపరి పోటీలో గెలవడానికి ప్రయత్నం చేయాలన్నారు. 43 కేజీల కేటగిరీలో పీకే సౌమ్య (మొదటి స్థానం), మౌనిక (ద్వితీయ స్థానం), జ్యోతి (మూడవ స్థానం), 47 కేజీల కేటగిరీలో జి.లత (మొదటి స్థానం), సమీరా (ద్వితీయ స్థానం) కే.సన (మూడవ స్థానం), 52 కేజీల కేటగిరీలో జి.మేఘన (మొదటి స్థానం), రమాదేవి (ద్వితీయ స్థానం), కే.అంజలి (మూడవ స్థానం), 57 కేజీల కేటగిరీలో సుమిత్ర (మొదటి స్థానం), మౌనిక (ద్వితీయ స్థానం) సంధ్య (మూడవ స్థానం)లో నిలిచారు. గెలుపొందిన లిఫ్టర్లకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి లోకేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలితో గుండెజబ్బులు దూరం

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కాలంలో యువతలో గుండె జబ్బులు పెరుగుతున్నాయని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో యువత గుండె సమస్యలతో బాధపడుతున్నట్లు చూస్తున్నామని, వైద్యులు సూచించిన విధంగా పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. కార్డియాలజిస్టులు నాగేంద్రప్రసాద్, సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. యువత మద్యపానం, దూమపానం చేయడం వల్ల గుండె సమస్యలు అధికమవుతున్నాయన్నారు. సీఈఓ డాక్టర్ సునీల్ సేపూరి, డాక్టర్ అరుణ, డాక్టర్ పీటర్ ప్రవీణ్, డాక్టర్ ఫరూక్ పాల్గొన్నారు.

మెడికవర్ హాస్పిటల్‌లో...

ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని మెడికవర్ హాస్పిటల్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియాలజిస్టులు డాక్టర్ ఎస్.చైతన్యకుమార్, డాక్టర్ సీఎస్ తేజానందన్‌రెడ్డి, డాక్టర్ బీఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. యువతలో హృదయ వ్యాధులు పెరుగుతున్నాయని,అధిక కొవ్వు ఆ హారం, వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, అనారోగ్య జీవనశైలి దీనికి ప్రధాన కారణాలు అని తెలిపారు.